సాక్షి నిజామాబాద్

గురువారం । 19 । డిసెంబర్ । 2024



మాతృభాషను మరువొద్దు

ఇతర భాషలను ఎంత నేర్చుకున్నా మాతృ భాషను మరువొద్దని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు.

- 8లో ▸



రిటైర్డ్ ఉద్యోగుల..

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.3 /8.4

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

తప్పులు లేకుండా నమోదు చేయాలి



బాల్కొండ: ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక సర్వేలో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంతో పాటు చిట్టాపూర్ గ్రామంలో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్, ఈవో రజనీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెండ్..!

- పోలీసు స్టేషన్‌లో నిందితుడి ఆత్మహత్య ఘటన కేసులో..

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి, రెంజల్(బోధన్): రెంజల్ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసులో కస్టడీలో ఉన్న నిందితుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ చర్యలకు ఉపక్రమించారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ప్రసాద్‌ను గురువారం సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈనెల 12న రెంజల్ పోలీసుస్టేషన్‌లో నిందితుడు రత్నావత్ రెడ్యా నైట్ ప్యాంట్‌కు ఉన్న నాడాతో కిటికీ ఉరివేసుకున్న విషయం తెలిసిందే. 'సాక్షి'లో ఈనెల 17న మెయిన్‌లో రెంజల్ పోలీసుస్టేషన్‌లో నిందితుడి ఆత్మహత్య వార్త కథనం, 18న జిల్లా పేజీలో పోలీసుల నిర్లక్ష్యంతోనే ఠాణాలో ఆత్మహత్య..! కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బందిని మందలించినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై మానవహక్కుల సంఘం నివేదిక కోరగా జిల్లా అధికారులు పంపించినట్లు సమాచారం. ప్రస్తుతం న్యాయమూర్తి చేత జుడీషియల్ ఎంక్వైరీ తోపాటు, మెదక్ జిల్లా తుఫ్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి డి పార్ట్ మెంట్ విచారణ జరుపుతున్నారు. కాగా రత్నాకత్ రెడ్యా ఆత్మహత్యకు సంబంధించిన పోస్టు మార్టం, ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చిన తర్వాతే బాధ్యులైన మిగతా పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఏడుగురి రిమాండ్..

రెంజల్ మండలంలోని ఓ గ్రామంలో మతిస్థిమితం లేని బాలికపై లైంగిక దాడి జరిపాడని నిందితుడు రత్నావత్ రెడ్యాపై దాడి చేసిన 13 మందిపై పోలీసులు నమోదు చేశారు. ఇందులో ఏడుగురిని గురువారం రిమాండ్‌కు తరలించారు.

జమ్మూ కాశ్మీర్‌కు బయల్దేరిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు



నిజామాబాద్‌నాగారం: ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించనున్న 37వ జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి క్రీడాకారులు బుధవారం బయల్దేరి వెళ్లారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కోపురి సంగీతరావు క్రీడాకారులను అభినందించారు. జమ్మూ కాశ్మీర్‌కు బయల్దేరిన బాలబాలికల వివరాలు ఇలా ఉన్నాయి.. బి.నిశిత, డి.లిఖిత, జి.వర్షిణి, డి.కీర్తన (సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి), ఆర్. సౌజన్య (ఆర్మూర్), కె.సంహిత (ధర్మారం), ఎస్.ప్రణయ్, రోహిత్ (ఉప్పల్‌వాయి), కే సాయిబాబు (ఆర్మూర్), రింటు (వేల్పూర్).

చలితో జాగ్రత్త..

గోరు వెచ్చటి నీరు తీసుకోవాలి

- చలివల్ల తేలిక పాటి జబ్బులు
- ఇన్‌ఫ్లూ ఎంజా వ్యాక్సిన్ తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: వాతావరణంలో మార్పులతో చలి తీవ్రత పెరిగింది. పిల్లలు, పెద్దలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో జనరల్ ఫిజీషియన్ (ఎండీ) డాక్టర్ చిటిమెల్ల సంతోష్‌కుమార్ పలు సూచనలు చేశారు.

- చలి తీవ్రత పెరగడంతో పిల్లలు, పెద్దలు అనారోగ్యానికి గురవుతున్నారు. పిల్లల్లో ఇమ్యూనిటీ చాలా తక్కువగా ఉంటుంది. చలి వల్ల తేలిక పాటి జలుబు, జ్వరం, దగ్గు ప్రారంభం అవుతుంది. కాస్త నిర్లక్ష్యం చేసినా న్యూమోనియా బారి న పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చిన్నపిల్ల లు జ్వరాల బారిన పడితే వెంటనే వైద్యులకు చూపించాలి. చల్లటి గాలులు వీచే సమయంలో వాకింగ్, జాకింగ్‌కు పిల్లలు, పెద్దలు దూరంగా ఉండాలి. ప్రతినిత్యం మూడు పూ టల గోరు వెచ్చని నీటిని తీసుకోవడం చాలా మంచిది.
- 8 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వారు ఇన్‌ఫ్లూఎంజా వ్యాక్సిన్ తీసుకోవాలి.
- పిల్లలు, వృద్ధులు వెచ్చని దుస్తులు ధరించాలి. చలి గాలులకు బయటకు పంపొద్దు. ఆస్తమా, సీఓపీడీ (ఊపిరి తిత్తుల వ్యాధి) బాధితులు, స్మోకింగ్ చేసే వారికి ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుంది. చల్లటి గాలులతో జ్వరం ఎక్కువగా ఉంటుందని, దగ్గు, జలుబు వస్తుంది. దుమ్ము, ధూళీ పట్ల జాగ్రత్త అవసరం. అలర్జీ ఉన్న వారు చిన్నపాటి జాగ్రత్తలు పాటించాల్సిందే. ఖచ్చితంగా పౌష్టికాహారం తీసుకోవాలి. వేడివేడి ఆహారం మాత్రమే తినాలి. తాజా కూరగాయాలు, ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలి.






– డాక్టర్ చిటిమెల్ల సంతోష్‌కుమార్, ఎండీ జనరల్ ఫిజీషియన్

సస్యరక్షణతో చీడపీడలు దూరం

- నారుమడిపై తాటిపత్రులు కప్పిఉంచాలి
- మామిడి పూత రక్షణకు పొగ పెట్టాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): యాసంగి సీజన్‌లో సాగవుతున్న పంటలపై చలి పంజా విసురుతోంది. ప్రతికూల వాతావరణంతో వరి, మిరప, మక్క పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయి. నారుమడులు సక్రమంగా ఎదగడం లేదు. తెగుళ్లతో రంగు మా రుతున్నాయి. చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ రైతులను పలు సూచనలు, సలహాలు అందించారు.

- నారుమడిని రక్షించుకోవడానికి పగటి పూట వెచ్చటి నీటిని అందించాలి. మంచు పడకుండా తాటి పత్రు లు కప్పి ఉంచాలి. నారు ఆరోగ్యంగా పెరిగేందుకు యూ రియాకు 2 గ్రాముల కార్బండిజమ్‌తో పాటు మాంకోజెబ్ మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి. ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింకు సల్ఫేట్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు నుంచి కాపాడుకోవడానికి కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు ఎకరానికి సరిపడే నారు మడికి కిలో చొప్పున చలితే సరిపోతుంది.
- మొక్కజొన్న, జొన్న ఆకులు రంగు మారితే వ్యవసాయాధికారులు సూచించిన మందులు వాడాలి.
- మిరప నారు వేస్తే నేలను నిరంతరంగా తడిగా ఉంచకుండా రెండు వారాలకోసారి నీటి తడులు అందించాలి. గొర్రెలు, కోళ్ల ఎరువులను వేస్తే పంటకు వెచ్చగా ఉంటుంది. మొక్కల వద్ద డీఏపీ పోస్తే ఎదుగుదల ఉంటుంది.
- చలి ఎక్కువగా ఉంటే మామిడి పూతపై ప్రభావం ఉంటుంది. దీనికి రాత్రుళ్లు చలి మంటలు పెట్టి పొగ వచ్చేలా చూసుకోవాలి.





– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాలెట్ బాక్సులు మండలాల వారీగా పంపిణీ చేస్తున్నారు. పంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను తయారు చేశారు. మొత్తం ఓటర్లు ఎనిమిది లక్షలపైగా ఉన్నారు. జిల్లాలో పాత పంచాయతీలు 530 ఉండగా కొత్తగా ఆవిర్భవించిన పంచాయతీలు 15 ఉన్నాయి. అన్నింటిలో మొత్తం వార్డుల స్థానాలు 5,022 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



పంచాయతీ ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు

- సిద్ధమవుతున్న యంత్రాంగం
- పోలింగ్ బూత్‌ల తుది జాబితా విడుదల
- మండలాల వారీగా పోలింగ్ సామగ్రి పంపిణీ
- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి



ఏర్గట్ల ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీవో తదితరులు

మోర్తాడ్(బాల్కొండ): గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ నిర్వహణకు షెడ్యూల్‌ను ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఖరారు చేయడమే మిగిలి ఉంది. ఏ క్షణంలో ఎన్నికల ప్రకటన వచ్చినా సిద్ధంగా ఉండేందుకు అధికారులు అన్ని మండలాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ బూత్‌ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఆమోదంతో మంగళవారం అన్ని మండల పరిషత్ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలలో అందుబాటులో ఉంచారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు ఇతర సామగ్రిని మండలాల వారీగా పంపిణీ చేస్తున్నారు. బోధన్, నిజామాబాద్ డివిజన్‌లలోని మండలాలకు పోలింగ్ సామగ్రి పంపిణీ చేయగా ఆర్మూర్ డివిజన్‌లో సామగ్రి పంపిణీ బుధవారం ప్రారంభించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణకు సంబంధించి అధికారులు ఒప్పందాలను పూర్తి చేసే దశలో ఉన్నారు. గ్రామ పంచాయతీల పదవీ కాలం ఫిబ్రవరి 2తో ముగిసిపోయింది. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే పంచాయతీల అజమాయిషీ కొనసాగుతోంది. గ్రామ పంచాయతీలకు ఎన్నికల ద్వారా ఎంపిక చేసిన పాలకులు లేకపోవడంతో కేంద్రం ఆర్థిక సంఘం ద్వారా కేటాయించే నిధులను నిలిపివేసింది. అలాగే గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించడం, వారికి పనిభారం అధికంగా ఉండటంతో గ్రామాలలో పాలన కుంటుపడింది.

ఎన్నికలను నిర్వహించి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు పాలనా బాధ్యతలను అప్పగిస్తేనే పంచాయతీలు గాడిలో పడే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎన్నికల తేదీలను ఖరారు చేయకపోయినా ఎన్నికల ఏర్పాట్లు క్షేత్ర స్థాయిలో పూర్తి చేయాలని ఆదేశాలు అందడంతో అధికారులు బిజిబిజీగా ఉన్నారు. జిల్లాలో పాత పంచాయతీలు 530 ఉండగా కొత్తగా ఆవిర్భవించిన పంచాయతీలు 15 ఉన్నాయి. అన్నింటిలో మొత్తం వార్డుల స్థానాలు 5,022 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను సైతం సిద్ధం చేశారు. ఓటర్లు మొత్తం 8,30,580 మంది ఉన్నారు. ఎన్నికల సంఘం, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఎన్నికల ప్రక్రియను ఆరంభించే అవకాశం ఉంది.

ఏర్పాట్లు జరుగుతున్నాయి

గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండలాల వారీగా సామగ్రిని పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఆదేశించగానే ఎన్నికల షెడ్యూల్ ఆరంభమవుతుంది. ఎప్పుడు ప్రకటన వచ్చినా ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేశాం.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి

పంచాయతీ కార్మికులకు మంచి రోజులు

గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్, ఆపరేటర్లకు మంచి రోజులు రాబోతున్నాయి. ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో నెలకు రూ.9500 చొప్పున వేతనాలు జమ చేయనుంది. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం మల్టీపర్పస్ వర్కర్స్, ఆపరేటర్ల పూర్తి వివరాలను సేకరించింది. కొత్త సంవత్సరం జనవరి నుంచి వారి ఖాతాల్లో వేతనాలను జమ చేయాలని భావిస్తోంది. కాగా పెండింగ్ వేతనాలను ఎలా చెల్లిస్తారోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

- వచ్చేనెల నుంచి నేరుగా ఖాతాల్లోకి వేతనాలు
- మల్టీపర్పస్ వర్కర్ల వివరాల సేకరణ పూర్తి
- పెండింగ్ వేతనాల చెల్లింపుపై స్పష్టత కరువు



గుండారం గ్రామపంచాయతీ కార్యాలయం

సుభాష్‌నగర్: జిల్లాలో 545 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మల్టీపర్పస్ వర్కర్స్ (కారోబార్లు, వాటర్‌మెన్, సఫాయి కార్మికులు), ఆపరేటర్లు కలిపి 3054 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయేడాది ఫిబ్రవరి 2తో పంచాయతీల పాలకవర్గం గడువు ముగిసింది. అప్పటి నుంచి జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఏడాది కాలంగా మల్టీపర్పస్ వర్కర్స్ కార్మికుల వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది.

ఏడాదిగా వేతనాల్లేవ్..

పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్లకు ఏడాది కాలంగా సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదు. పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేసింది. జనవరి నుంచే పెంచిన వేతనాల మేరకు వారి ఖాతాల్లో జమ చేయనుంది. ఇప్పటికే కార్మికులు, ఆపరేటర్ల పేర్లు, ఫోన్‌నెంబర్, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, ఐఎఫ్ఎస్‌సీ నంబర్ తదితర పూర్తి వివరాలను జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి పంపించారు.

వేతనాల నిధులు విడుదల

జిల్లాలో అనేక గ్రామాల్లో కార్మికులకు నాలుగైదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఇంటి పన్నులు వసూలు చేసి అవసరం మేరకు వేతనాలు చెల్లించారు. ఆరునెలల క్రితం ప్రభుత్వం ప్రత్యేకంగా పంచాయతీ కార్మికుల వేతనాల కోసం నిధులు విడుదల చేసింది. అయినప్పటికీ ఇంకా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై ఉన్నతాధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

కార్మికుల వివరాలు నివేదించాం



జిల్లాలో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల పూర్తి వివరాలను పంచాయతీరాజ్ కార్యాలయానికి నివేదించాం. ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా వచ్చే నెల నుంచి వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రతి నెలా రూ.9500 వేతనం చెల్లిస్తున్నాం. పంచాయతీ ఎన్నికల తర్వాత కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందా అనే దానిపై ఎలాంటి సమాచారం లేదు.

– శ్రీనివాస్, ఇన్‌చార్జి డీపీవో

పెండింగ్ వేతనాలు జమ చేయాలి



పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్స్ వేతనాలు ప్రతినెలా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం సంతోషకరమే. పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను కూడా ప్రభుత్వం జమ చేయాలి. కార్మికులు ఇప్పటికే సక్రమంగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పెండింగ్ వేతనాల చెల్లింపుపై పునరాలోచన చేయాలి.

– చిలుక మారుతి, టీజీకేఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఎక్కని గడప లేదు.. మొక్కని ఎమ్మెల్యే లేడు

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చండి
- అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ వినతి పత్రాలతో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎక్కని గడప లేదు.. మొక్కని ఎమ్మెల్యే లేడు అని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడారు. వారి హామీలను నెరవేర్చి, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని నూత్‌పల్లి, కుద్వాన్‌పూర్ వంటి హాస్టల్స్‌లో కనీస వసతులు లేవన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పనులు చేయడం లేదన్నారు. డొంకేశ్వర్ మండలానికి జూనియర్ కళాశాల, నందిపేటకు డిగ్రీ కళాశాల మంజూరు చే యాలని కోరారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంకాపూర్‌లో ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అతిత్వరలో ఎమ్మెల్యే మాట్లాడిన వాటిపై చర్చించి పరిష్కరించడంతో పాటు నిధులు మంజూరు చేస్తామని అన్నారు.

అటకెక్కిన విచారణ

- విద్యాశాఖలో బోగస్ నియామకాలు చేసిన గ్లోబల్ ఫౌండేషన్
- కేసులు నమోదు చేసి వదిలేశారు..

నిజామాబాద్‌అర్బన్: బోగస్ ఉద్యోగాలపై విచారణను జిల్లా విద్యాశాఖ పక్కన పెట్టేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఓ స్వచ్ఛంద సంస్థ చేపట్టిన నియామకాలు బోగస్ అని తేలింది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు పోలీసు కేసులు కూడా నమోదు చేయించారు. అయితే విచారణ జరిపి సంబంధిత నిందితులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి చేతులెత్తేశారు. మళ్లీ అదే సంస్థకు అనుమతి ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

జిల్లా విద్యాశాఖలో, వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్లు ఉచితంగా అందించి ఆపరేటర్లు, సహాయకులు, సిబ్బందిని నియమించేందుకు గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర విద్యాశాఖ నుంచి అనుమతి పొందింది. ఇదే క్రమంలో జిల్లాలో 16 మంది నియామకాలు కూడా చేపట్టింది. బాల్కొండ, మోర్తాడ్, నవీపేట, నిజామాబాద్ ప్రాంతాలలో కంప్యూటర్ ఆపరేటర్లు, సహాయకులను భర్తీ చేసింది. ఇదిలా ఉండగా రాజు అనే వ్యక్తి గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ పేరిట నకిలీ అనుమతి పత్రాన్ని కొందరికి విక్రయించి ఒక్కొక్కరి నుంచి రూ. రెండు లక్షల వరకు వసూలు చేశారు. ఇలా 12 మంది నుంచి డబ్బులు తీసుకున్నారు. అయితే వారికి ఉద్యోగ నియామకాలకు సంబంధించి నకిలీ పత్రాలను అందించారు. ఈ వ్యవహారాన్ని 'సాక్షి' ఆగస్టులో వెలుగులోకి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా చర్చనీశంగా మారింది. స్పందించిన నాటి జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గ ప్రసాద్ విచారణ చేపట్టారు. గ్లోబల్ ఫౌండేషన్ తరపున నియామక పత్రాలు పొందిన వారిని కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు. అయితే గ్లోబల్ ఫౌండేషన్‌కు చెందిన ప్రతినిధిగా చెప్పుకున్న రాజు అనే వ్యక్తి రూ. 2 లక్షల చొప్పున తీసుకుని నియామక పత్రాలు ఇచ్చినట్లు అధికారుల ఎదుట ఆరుగురు అభ్యర్థులు తెలిపారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు రూరల్ పోలీస్ స్టేషన్, బాల్కొండ పోలీస్ స్టేషన్‌లలో నిందితుడు రాజు పై ఫిర్యాదు చేశారు. మరోవైపు శాఖాపరంగా విచారణ చేపట్టారు. గ్లోబల్ ఫౌండేషన్ రద్దు చేయాలని డీఈవో దుర్గ ప్రసాద్ రాష్ట్ర విద్యాశాఖకు నివేదిక సమర్పించారు. ఇందులో భాగంగానే గ్లోబల్ ఫౌండేషన్ అనుమతి రద్దయింది. అనంతరం జిల్లాలో అక్రమ నియామకాలకు సంబంధించి పాఠశాలల వారీగా విచారణ చేపట్టారు. నియామక పత్రాలు ఎవరెవరు తీసుకున్నారు, ఎన్ని డబ్బులు చెల్లించారు తదితర వివరాలపై విచారణ చేశారు. కాగా గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ అనుమతి రద్దు కాగానే విచారణ కూడా నిలిపివేశారు.

విచారణ కొనసాగుతోంది

పోలీసుల విచారణ కొనసాగుతోంది, విద్యాశాఖ గ్లోబల్ పౌండేషన్ అనుమతి రద్దు చేశారు. డబ్బులు వసూలు చేసిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిసింది.

– శ్రీనివాస్ రావు, కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్

కార్పొరేషన్‌కు కొత్త ఉద్యోగులు

- మూడు మున్సిపాలిటీలకు 70 మంది
- భీమ్‌గల్‌కు కేటాయించలేదు



కొత్త ఉద్యోగులకు నియామక పత్రాలు ఇస్తున్న కార్పొరేషన్ కమిషనర్

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహించేందుకు కొత్త ఉద్యోగులు రానున్నారు. గ్రూప్–4 ఉద్యోగాలు పొంది ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులు విధుల్లో చేరనున్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ కొత్త ఉద్యోగులకు నియామక పత్రాలు అందించారు. 60 రోజుల లోపు వారు విధుల్లో చేరాల్సి ఉంటుంది. జిల్లాలోని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్ మున్సిపాలిటీ, ఆర్మూర్ మున్సిపాలిటీలకు కలిసి మొత్తం 70 మంది నియామకమయ్యారు. వీరిలో నలుగురు మున్సిపల్ వార్డు ఆఫీసర్లు ఉన్నారు. నిజామాబాద్ బల్దియాలో 37 మంది, ఆర్మూర్ మున్సిపాలిటీలో 18 మంది, బోధన్ మున్సిపాలిటీలో 10 మందిని నియమించారు. భీంగల్ మున్సిపాలిటీకి ఎవరినీ కేటాయించలేదు. ఉద్యోగులకు సర్వీస్ రూల్స్, నియమ నిబంధనలు అడిషనల్ కమిషనర్ ఎస్ శంకర్ వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ దిలీప్‌కుమార్, అడిషనల్ కమిషనర్ ఎస్ శంకర్, మున్సిపల్ మేనేజర్ జనార్దన్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా సీఎం కప్ టోర్నీ



నిజామాబాద్‌నాగారం: సీఎం కప్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతోంది. బుధవారం అథ్లెటిక్స్, సైక్లింగ్, ఖోఖో పోటీలు నిర్వహించారు. క్రీడల కార్యదర్శి ముత్తెన్న ఆధ్వర్యంలో టోర్నీ కొనసాగుతుండగా, ప్రతి కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అథ్లెటిక్స్ పోటీలను నాగారంలోని రాజారాం స్టేడియంలో, పాత కలెక్టరేట్ మైదానంలో ఖోఖో, కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. కిక్ బాక్సింగ్ కోసం పాత కలెక్టరేట్ మైదానంలో రాష్ట్రస్థాయికి ఎంపికలు చేశారు. పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

సెలవుపై వెళ్లిన ఇరిగేషన్ డిప్యూటీ సీఈ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ఇరిగేషన్ డిప్యూటీ సీఈగా విధులు నిర్వర్తిస్తున్న సయ్యద్ హైమాద్ జానీ వ్యక్తిగత సెలవుల్లో వెళ్లారు. ఆయన బోధన్ డివిజన్ ఈఈగా సైతం విధులు నిర్వహిస్తున్నారు. సీఈ కార్యాలయం పరిధిలో డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న పి ప్రవీణ్ కుమార్‌ను అదనపు డిప్యూటీ సీఈగా సైతం విధులు నిర్వర్తించాలని ఇరిగేషన్ శాఖ రాష్ట్ర కార్యదర్శి రాహుల్ బొజ్జ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు బుధవారం వెలువడ్డాయి. దీంతో పాటు బోధన్ ఈఈ పోస్టు ఖాళీ అయ్యింది. నవీపేట్ సబ్ డివిజన్‌లో డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న ఏ బలరాంకు సైతం బోధన్ ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలు అప్పగించారు.

23 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు



తెయూ(డిచ్‌పల్లి): ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 43వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ పిలుపునిచ్చారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట ఏబీవీపీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులు మహాసభలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెయూ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షుడు నవీన్, జాయింట్ సెక్రెటరీ సమీర్, నాయకులు అక్షయ్, మోహన్, నాయకులు లెనిన్, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

30 వరకు పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ పరీక్షల ఫీజును ఈ నెల 30 వరకు చెల్లించాలని వర్సిటీ కంట్రోలర్ అరుణ బుధవారం తెలిపారు. పీజీ ఒకటో, మూడో సెమిస్టర్ రెగ్యులర్ థియరీ, ప్రాక్టికల్స్ ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎంబీఏ, ఎంసీఏ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సు ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ మొదటి సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్ ఐఎంబీఏ 7వ, 9వ సెమిస్టర్ పరీక్షల ఫీజును చెల్లించాలన్నారు. ఒకటో సెమిస్టర్ (ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎమ్మెస్సీ) ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు(ఏపీఈ) అన్ని సబ్జెక్టులు కలిపి పరీక్ష ఫీజు రూ.500, ప్రాసెసింగ్ ఫీజు రూ.200, ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు (పీసీహెచ్) ఫీజు రూ.800, ప్రాసెసింగ్ ఫీజు రూ.200, ఎంబీఏ, ఐఎంబీఏ, ఎంసీఏ, అన్ని సబ్జెక్టులు కలిపి రూ.800, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పీజీ మూడో, ఐఎంబీఏ ఏడో, మూడో సెమిస్టర్స్, ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు(పీసీఈ) అన్ని సబ్జెక్టులు కలిపి ఫీజు రూ.500, ఐఎంబీఏ అన్ని సబ్జెక్టులు కలిపి రూ.800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా 30వరకు చెల్లించొచ్చని వివరించారు.

చలికాలం..

లైట్లు వేసుకుని వాహనాలపై వెళ్లాలి



ఖలీల్‌వాడి: పొగ మంచు కారణంగా ముందు వచ్చే వాహనాలు కనబడవు. లైట్లు వేసుకుని వాహనాలపై వెళ్లాలి. ఉదయం, రాత్రివేళలో కార్లు, ద్విచక్ర వాహనాల లైట్లు వేసుకోవడం మరువొద్దు. పొగమంచు కురుస్తున్న నేపథ్యంలో ప్రయాణ సమయంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా రవాణాధికారి ఉమామహేశ్వరరావు 'సాక్షి' ద్వారా వివరించారు.

- చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో పాత వాహనాల ఇంజిన్లను హీట్ చేయాలి.
- కార్లలో ప్రయాణించేవారు వైపర్‌లను ఆన్‌లో ఉంచాలి.
- పొగమంచు కురుస్తున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లను గమనిస్తూ వాహనాలు నడపాలి.
- చలికి వాహనాల టైర్లు గట్టి పడి స్కిడ్ అయ్యే అవకాశాలు ఉంటాయి.
- ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.
- కారులలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలి.
- పొగమంచు ఎక్కువగా కురుస్తున్న సమయాల్లో ప్రయాణం వాయిదా వేసుకోవాలి.
- చలి తీవ్రత నేపథ్యంలో వాహనాలను బ్యాటరీల పనితీరును పరిశీలించాలి. బ్యాటరీ టెర్మినల్స్‌ను తనిఖీ చేయాలి. తుప్పు పట్టి కనిపిస్తే బేకింగ్ సోడా, నీటితో శుభ్రం చేయండి. ఇది కారు బ్యాటరీ శక్తిని పెంచుతుంది. అప్పుడు కారు సులభంగా స్టార్ట్ అవుతుంది.
- మంచు రోడ్లపై జారుతున్న కార్ల వీడియోలు వైరల్ అవుతున్నాయి. మంచు ప్రాంతాలకు కార్లపై వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి.
- చలికాలంలో కార్లు, బైకులు బయటకు తీయకుంటే ఇంజిన్ ఆయిల్ గడ్డ కట్టే ప్రమాదం ఉంటుంది. అప్పుడప్పుడు బైక్ లను స్టార్ట్ చేయాల్సి ఉంటుంది. దీంతో ఇంజిన్ సక్రమంగా పనిచేయడానికి వీలు ఏర్పడుతుంది.



- ఉమామహేశ్వర్‌రావు, జిల్లా రవాణాధికారి

పశు సంపదకు పొంచి ఉన్న ముప్పు



డొంకేశ్వర్(ఆర్మూర్): చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో పశువులు, గేదెలతోపాటుగా పెంపుడు కోళ్లు, కుక్కలను వెచ్చని వాతావరణంలో ఉంచాలి. దూడలకు న్యుమోనియా వచ్చే ప్రమాదం ఉంది. కోళ్ల ఫారాల యజమానులు నిర్లక్ష్యం చేస్తే కోళ్లకు వైరస్ సోకే అవకాశం ఉంది. చలి నుంచి పశుసంపదను రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి 'సాక్షి' ద్వారా వివరించారు.

- పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలను ఉంచే షెడ్డులను రాత్రుల్లో వెచ్చగా ఉంచాలి. అక్కడక్కడా చలి మంటలు ఏర్పాటు చేయాలి. అలాగే చలికాలం ముగిసే వరకు షెడ్ల చుట్టూ గోనె సంచులతో పరదాలు కట్టాలి. కోళ్ల ఫారాల వద్ద కూడా ఇలాగే చేయాలి. చలి తీవ్రతకు చిన్న వయసు దూడలు న్యుమోనియా బారిన పడకుండా రాత్రుల్లో ప్రత్యేక గదిలో ఉంచాలి. పాలిచ్చే గేదెలు అనారోగ్యానికి గురైతే వెంటనే పశువైద్య అధికారులకు సమాచారం అందించి చికిత్స చేయించాలి.
- పశువులు అనారోగ్యానికి గురి కాకుండా మోతాదులో దాణా అందించాలి. చల్లని నీరు తాగకుండా చూడాలి. గేదెలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి పాలు పితకాలి. గేదెలు సాయంత్రం ఐదింటికి వచ్చేలా చూసుకోవాలి.
- కుక్క, పిల్లి లాంటి పెంపుడు జంతువులను పెంచుకునే వారు వాటికి ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి ప్రోటీన్లు కలిగిన ఆహారం అందించాలి. అవసరమైతే రాత్రుల్లో వెచ్చటి దుస్తులు లేదా దుప్పటి ఉంచాలి. చలిబారిన పడితే వాటి ప్రవర్తలో మార్పు కూడా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి అనారోగ్యానికి గురై ఆహారం తినకపోతే వెంటనే పశువైద్య అధికారిని సంప్రదించాలి.



- జగన్నాథచారి, పశుసంవర్ధక అధికారి

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్, గడుగు గంగాధర్, కేశ వేణు



పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

నిజామాబాద్ నాగారం: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వెల్‌నెస్ సెంటర్‌ను మరో భవనంలోకి మార్చేందుకు, రిటైర్డ్ ఉద్యోగుల భవనం వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని అసోసియేషన్‌కు అప్పగించేలా కలెక్టర్ రాజీవ్‌గాంధీహనుమంతుతో మాట్లాడుతానన్నారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, బాపూజీ వచనాలయం చైర్మన్ భక్తవత్సలం, డీఈవో అశోక్, ట్రెజరరీ డిప్యూటీ డైరెక్టర్ దశరథ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడ్యాల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల భోజాగౌడ్, ట్రెజరర్ పి ఆశయ్య, ఎల్ జగత్ రెడ్డి, దయాకర్‌రావు, రంగయ్య, పెద్దుల గంగాధర్, బి లింగయ్య, రంగయ్య, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండోకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన జిల్లా క్రీడాకారిణి రాఘ పూజిత ఎంపికైంది. ఈ ఏడాది నవంబర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన అండర్–19 విభాగంలో పూజిత ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ నెల 18 నుండి 24 వరకు మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఈవెంట్‌లో పూజిత పాల్గొననుంది.

జనవరిలో తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 జనవరిలో కేంద్రంలో 'తెలంగాణ గోల్డ్ కప్ 2025' క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో టీసీఏ నిజామాబాద్ జిల్లా ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌తో సహా 32 జిల్లాలలో ఈసారి తెలంగాణ గోల్డ్ కప్ పేరుతో క్రికెట్ సంబరాలు నిర్వహిస్తామని, ముందుగా నమోదు చేసుకున్న 32 జట్లకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే టోర్నీలో టాలెంట్ సెర్చ్‌ను సైతం చేపట్టనున్నట్లు తెలిపారు. విజేతలకు రూ. 50వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.25 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. టోర్నీ నిర్వహణ కోసం తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అందుబాటులో ఉన్న రెండు మూడు మైదానాలను పరిశీలించినట్లు తెలిపారు. వందలాది సంఖ్యలో ఎంట్రీలు వచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహణ కమిటీ నిబంధనల మేరకు కొంత ఎంట్రీ ఫీజును నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని నిజామాబాద్ జిల్లా క్రికెట్ అభిమానులు, క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు నయూమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ భాషను మరవొద్దు



ప్రసంగిస్తున్న తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు



ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి..

- తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు
- తెయూలో ఏడు రోజుల పునశ్చరణ తరగతులు ప్రారంభం

తెయూ (డిచ్‌పల్లి): ఇతర భాషలను ఎంతగా నేర్చుకున్నా మాతృ భాషను ఎట్టి పరిస్థితుల్లోనూ మరిచిపోవద్దని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (భారతీయ భాషా విభాగాల సంస్థ), తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు ఆధ్యాపకులకు ఏడు రోజుల పునశ్చరణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. విద్యావికాసానికి మాతృభాషలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. తెలుగు భాష మాట్లాడేటప్పుడు ముఖ కవళికలను ఆధారం చేసుకుని గుర్తించవచ్చన్నారు. ఇలాంటి పునశ్చరణ తరగతుల వల్ల తెలుగు పాఠ్య ప్రణాళికలో నూతన రూపకల్పనలు ఉంటాయన్నారు. తెలుగు భాషలోని పోతన్నగారి పద్య వైభవాన్ని చక్కగా, ప్రస్తావించారు. కీలకోపాన్యాసకులుగా హాజరైన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఆది మానవుని కాలం నుంచి నేటి వరకు భాష ఏ విధంగా పరిణామం చెందిందో వివరించారు. ప్రాచీన సాహిత్యం అధ్యయనం వల్ల కలిగే ప్రయోజనం, పరిణతిని తెలుసుకుని విద్యార్థులకు వివరించాలని పునశ్చరణ తరగతులకు వచ్చిన ఆధ్యాపకులకు సూచించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారితోపాటు ఇతర రాష్ట్రాలలోని తెలుగు అధ్యాపకులు సుమారు 80 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి, కార్యక్రమ నిర్వాహకురాలు కరిమండ్ల లావణ్య, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

చెరువు నీటిని వదిలిన వ్యక్తికి మూడేళ్లు..

రుద్రూర్: కోటగిరి దామర చెరువు నీటిని అనుమతి లేకుండా విడుదల చేసిన ఎండీ కలీం అనే వ్యక్తికి న్యాయస్థానం మూడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 2016 నవంబర్ 8వ తేదీన కలీం అనుమతి లేకుండా చెరువు నీటిని విడుదల చేసి రైతులకు నష్టం కలిగించడంతోపాటు కాపలా ఉన్న రెవెన్యూ సిబ్బందిని బెదిరించాడని తెలిపారు. బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనలు వినిపించారని, నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఈ శివసాయి తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.

చీటింగ్ కేసులో 18 నెలలు..

బోధన్ టౌన్(బోధన్): చీటింగ్ కేసులో ఓ వ్యక్తికి 18 నెలల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం పూజిత బుధవారం తీర్పునిచ్చారు. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బయ్యన్‌వార్ హన్మంత్‌పై ఎస్ ప్రభాకర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా, 2015లో పట్టణ పోలీస్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 18 నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



మలావత్ మంగ్లీ(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బెజుగం చెర్వుతండా గ్రామ మాజీ సర్పంచ్ మలావత్ మంగ్లీ(56) బుధవారం మృతి చెందింది. సుమారు ఏడు నెలల క్రితం ఆమె ఆర్టీసీ బస్సులో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. అప్పటి నుండి మంగ్లీ మంచానికే పరిమితమై బుధవారం మృతి చెందింది. ఇదిలా ఉండగా మంగ్లీ భర్త హరిలాల్ తన భార్య తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైందనే బెంగతో ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఆరు నెలల వ్యవధిలో భార్యాభర్తలు మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ముగ్గురి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చికంపౌండ్ ప్రాంతంలోని గోశాల గేట్టు వద్ద పార్కింగ్ విషయంలో మాటామాటా పెరిగి చంద్రకాంత్(28) అనే యువకుడిపై ముగ్గురు దాడి అతడు మృతి చెందారు. ఈ కేసులో దాడికి పాల్పడిన మనీశ్(ఆర్మీజవాన్), సతీశ్‌గౌడ్, సాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

అటవీ భూమి స్వాధీనం

సిరికొండ: సిరికొండ రేంజ్ పరిధిలోని హుస్సేన్‌నగర్ బీట్‌లో ఉన్న కంపార్ట్‌మెంట్ నెంబర్ 408లో సిరికొండ మహిపాల్ తండావాసులు ఆక్రమించుకున్న అటవీ భూమిని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి రేంజర్ రవీందర్ తెలిపారు. ఆక్రమణకు గురైన అటవీ స్థలంలో కందకాలు తవ్వించినట్లు ఆయన తెలిపారు. అటవీ భూమిలో అక్రమంగా వేసిన గుడిసెను తొలగించామన్నారు. అటవీ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డిప్యూటీ రేంజర్ గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి ఒకరు మృతి

బీబీపేట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో గాయాపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేటకు చెందిన నీల రాజయ్య (52) మంగళవారం రోజున నస్కల్ గ్రామం నుంచి బీబీపేటకు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

- ఐదు రోజుల తరువాత వెలుగుచూసిన ఘటన
- కంది తోటలో మృతదేహం లభ్యం
- డోంగ్లీ మండలం మొగాలో విషాదం



మాల్గే బస్వంత్ రావ్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): చెరుకు తోటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు పాముకాటుతో మృతి చెందిన ఘటన డోంగ్లీ మండలం మొగాలో చోటు చేసుకుంది. ఐదు రోజుల తరువాత ఈ ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మొగా గ్రామానికి చెందిన బస్వంత్‌రావు(65)కు భార్య హన్మబాయి, నలుగురు ఆడ పిల్లలు ఉన్నారు. నలుగురు ఆడ పిల్లల వివాహం చేయగా, ఇంట్లో భార్యాభర్తలు ఉంటున్నారు. బస్వంత్‌రావు తనకు ఉన్న రెండు ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన ఉదయం బస్వంత్‌రావు తన భార్యతో కలిసి బిచ్కుందలోని బంధువుల ఇంటికి వెళ్లారు. హన్మబాయిని బంధువుల ఇంటి వద్దే ఉంచి మొగాకు వచ్చేసిన బస్వంత్‌రావు శనివారం సాయంత్రం చెరుకు తోటకు నీరు పెట్టేందుకు వెళ్లగా పాము కాలికి కాటేసింది. కాలి నుంచి శరీరానికి విషం పాకకుండా బస్వంత్‌రావు తెల్లని గుడ్డను కాలికి కట్టుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని కంది చేనులో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కందిపంట బాగా ఎత్తుగా పెరడగంతో అందులో పడిపోయిన బస్వంత్‌రావు ఎవరికీ కనపడలేదు. శనివారం నుంచి బస్వంత్‌రావుకు ఆయన భార్య ఫోన్ చేస్తూనే ఉంది. మంగళవారం బస్వంత్‌రావు తమ్ముడి కొడుకు రాజు తీవ్రంగా గాలించడం ప్రారంభించాడు. బుధవారం ఉదయం తోటకు వెళ్లి చూడగా బస్వంత్‌రావు మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. శనివారం నుంచి బుధవారం వరకు బస్వంత్‌రావు మృతదేహం ఘటనాస్థలంలోనే ఉందని ఆయన చేతిలో ఫోన్ కూడా ఉందని చెప్పారు. బస్వంత్‌రావు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన భార్య హన్మబాయి, నలుగురు కూతుళ్లు బోరున విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. బుధవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

బట్టలు ఉతుకుతుండగా కాటేసిన పాము



పోగుల లలిత(ఫైల్)

ఇందల్వాయి: పాముకాటులో వివాహిత మృతి చెందిన ఘటన సిర్నాపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోగుల లలిత ఇంటివద్ద బట్టలు ఉతుకుతుండగా పాము కాటు వేసింది. స్థానికులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త నర్సయ్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత

ఖలీల్‌వాడి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసిన పోలీసులు నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తొమ్మిది మందికి అందజేశారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు తమకు ఫిర్యాదుచేయగా సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసి వారికి అందజేశామని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు.

జిల్లా కేంద్రంలో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన ల్యాబ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. మంగళవారం రాత్రి నగరంలోని రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీకి పాల్పడగా, మరో పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. రహమత్‌నగర్‌లోని వెల్‌కమ్ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఓ ఇంటి తాళాన్ని పగులగొట్టిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

అలాగే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖలీల్‌వాడిలో ఉన్న గౌతమి పాథాలాజికల్ ల్యాబ్ షట్టర్‌ను దుండగులు పగలగొట్టి రూ.10వేలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద పోస్టాఫీస్ ప్రాంతంలో ఉన్న మెడికల్ షాపులో దుండగులు చోరీకి యత్నించినట్లు ఎస్సై యాసిన్ ఆరాఫత్ తెలిపారు. మెడికల్ షాపులే టార్గెట్‌గా ఓ ముఠా చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కమ్మర్‌పల్లిలో..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పలు ఇళ్లలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇళ్ల తాళాలను పగులగొట్టి చోరీ చేశారు. కలాల శ్రీలేఖ అనే మహిళ ఇంట్లో నుంచి అర తులం బంగారం, 18 తులాల వెండి, కొంత నగదును ఎత్తుకెళ్లారు. చింత గణేశ్ అనే వ్యక్తి ఇంట్లోనూ చోరీకి పాల్పడ్డారు. రమేశ్ అనే వ్యక్తి ఇంటి ముందు నిలిపి ఉంచిన హోండా యాక్టివాను ఎత్తుకెళ్లి మోర్తాడ్ సరిహద్దు లోని వ్యవసాయ క్షేత్రం వద్ద వదిలేశారు. పెట్రోల్ అయిపోవడంతో వాహనాన్ని ధ్వంసం చేసి వదిలేశారు. సుధాకర్ అనే వ్యక్తి ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలోని వస్తువులను ఎత్తుకెళ్లారు. భీమ్‌గల్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై అనిల్ రెడ్డి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు మృతి



సిద్దవ్వను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు: మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్వాపూర్ గ్రామానికి చెందిన గూడెం గారి సిద్దవ్వ (48) మృతి చెందింది. పెద్దమల్లారెడ్డి క్రాసింగ్ వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసముంటున్న సిదవ్వ దాబా హోటల్‌లో పని చేస్తోంది. దాబాలో పని అయిపోయిన తరువాత ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. అదే సమయంలో హైదరాబాద్‌నుంచి భిక్కనూరుకు వస్తున్న పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి గమనించి సిద్దవ్వను అందే దారిలో వెళ్తున్న అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేశాడు. అంబులెన్స్ కొద్ది దూరం వెళ్లగానే సిద్దవ్వ ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి కుమారుడు సాగర్, కుమార్తెలు బబిత, రవళి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇందిరమ్మ గృహ సర్వే కోసం వస్తూ..



పిట్ల స్వప్న మృతదేహం

ఎల్లారెడ్డి: ఇందిరమ్మ గృహ సర్వే కోసం హైదరాబాద్ నుంచి వస్తున్న మండలంలోని రేపల్లెవాడకు చెందిన పిట్ల స్వప్న (25) మెదక్ జిల్లా కొల్చారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటున్న పిట్ల స్వప్న ఇందిరమ్మ గృహ సర్వే కోసం తన మరిది శ్రీనుతో కలిసి వస్తుండగా కొల్చారం శివారులో స్కూటీ డివైడర్‌కు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిందన్నారు. స్వప్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.